సైదాబాద్‌లో రేషన్‌కార్డుల రీ సర్వే నిర్వహించండి



డీసీకి వినతి పత్రం ఇస్తున్న బీజేవైఎం నాయకుడు రమణ్‌సింగ్

సైదాబాద్: సైదాబాద్ డివిజన్‌లో రేషన్‌కార్డుల రీ సర్వే నిర్వహించాలని రాష్ట్ర బీజేవైఎం నాయకుడు రమణ్‌సింగ్ కోరారు. ఈ మేరకు బీజేవైఎం నాయకులతో కలిసి జీహెచ్ఎంసీ డీసీని ఆయన కార్యాలయంలో శనివారం కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్న చాలామందిని సిబ్బంది సర్వే చేయలేదన్నారు. దానివలన నిజమైన లబ్ధిదారులు నష్టపోయే ప్రమాదముందన్నారు. జీహెచ్ఎంసీ అధికారులు చొరవ తీసుకొని రీ సర్వేకు ఆదేశాలు ఇవ్వాలని ఆయన కోరారు.

సైబర్ నేరాలపై అవగాహన



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

చాదర్‌ఘాట్: ఓల్డ్‌మలక్‌పేట డివిజన్ పోచమ్మ ఆలయం వద్ద శనివారం సాయంత్రం చాదర్‌ఘాట్ పోలీసులు, సైబర్ క్రైమ్ టీమ్‌తో కలిసి ప్రజలకు సైబర్ నేరాలపై శనివారం అవగాహన కల్పించారు. సైబర్ నేరగాళ్లు ప్రజలను ఎలా మోసం చేస్తున్నారో వివరించారు. ఎవరైనా సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930కి ఫిర్యాదు చేయాలని సూచించారు.

బడ్జెట్‌లో మధ్యతరగతి ప్రజలకు అన్యాయం



కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

ఎల్‌బీనగర్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పేదలు, మధ్యతరగతి ప్రజలకు తీరని అన్యాయం జరిగిందని సీపీఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య పేర్కొన్నారు. ఎల్‌బీనగర్ రింగ్‌రోడ్డులో కేంద్ర ప్రభుత్వం దిష్టిబొమ్మను శనివారం దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బడ్జెట్ దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టేలా ఉందన్నారు. విద్య, వైద్యానికి కేటాంపులు ఆశాజనకంగాలేవని వెంటనే బడ్జెట్‌ను సవరించి పేదలకు ఉపయోగపడేలా బడ్జెట్‌ను ప్రవేశపెట్టాలని లేకుంటే సీపీఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు, ఉద్యమాలు, పోరాటాలు చేస్తామని హెచ్చరించారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

రామంతాపూర్: అరవింద్‌నగర్‌లోని విశ్వశాంతి హైస్కూల్ వార్షిక క్రీడోత్సవాలను అదనపు డీసీపీ నర్సయ్య శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి కనబరిచి, మంచి క్రీడాకారులుగా ఎదగాలని ఆకాంక్షించారు. మాజీ ఏసీపీ అశోక చక్రవర్తి, స్కూల్ డైరెక్టర్ వెంకటేశం, ప్రిన్సిపాల్ రూపారాణి తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సమస్యలపై జలమండలి ఎండీకి వినతి

హబ్సిగూడ: డివిజన్‌లోని వివిధ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని స్థానిక కార్పొరేటర్ కక్కిరేణి చేతనాహరీష్ శనివారం జీహెచ్ఎంసీ జలమండలి ఎండీ అశోక్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. రాంరెడ్డినగర్, సాయిచిత్రనగర్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు త్వరగా పూర్తి చేయాలని కోరారు. తాగునీటిలో మురుగునీరు కలిసి కలుషితం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. సానుకూలంగా స్పందించిన ఎండీ త్వరలోనే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు సమాచారం.

నకిలీ డాక్టర్లపై కేసు నమోదు

మల్కాజిగిరి: మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ మౌలాలి ప్రాంతంలో ఫస్ట్ ఎయిడ్ సెంటర్లు నిర్వహిస్తున్న ఇద్దరు నకిలీ డాక్టర్లపై కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. మౌలాలి ఆర్టీసీ కాలనీ హనుమాన్‌నగర్‌లో శ్రావణి ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌ను బోడ వెంకటేశ్వర్లు, శ్రీకృప ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌ను జి.భాగ్యరేఖ గత కొన్ని రోజులుగా ఎంబీబీఎస్ డాక్టర్లుగా చలామణి చేస్తూ నిర్వహిస్తున్నారు. విశ్వసనీయ సమాచారంతో తెలంగాణ మెడికల్ కౌన్సిల్ అధికారి డాక్టర్ దండెం లాలయ్యకుమార్ ఆకస్మిక తనిఖీలు చేశారు. అధికారుల తనిఖీల్లో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. నిందితులపై మల్కాజిగిరి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆస్తి పన్ను వసూళ్లు అంతంతే!

- లక్ష్యం రూ. 144 కోట్లు.. వసూళ్లు రూ. 23 కోట్లు
- పెండింగ్‌లో రూ. 117 కోట్లు
- డిమాండ్ నోటీసులు జారీ చేస్తున్న అధికారులు
- రెండేళ్ల బకాయిదారులకు రెడ్ నోటీసులు
- మార్చి 31లోగా లక్ష్యాన్ని చేరుకునేలా కార్యాచరణ



అధికారులతో సమీక్షా నిర్వహిస్తున్న డీసీ జయంత్

చాదర్‌ఘాట్: జీహెచ్ఎంసీ సర్కిల్–6 పరిధిలో ఆస్తి పన్ను వసూళ్ల లక్ష్యానికి ఆమడ దూరంలో ఉన్నాయి. రూ. 144 కోట్ల వసూళ్ల లక్ష్యం కాగా ఇప్పటివరకు కేవలం రూ. 23 కోట్లు మాత్రమే వసూలైంది. ఇంకా రూ. 117 కోట్లు వసూలు కావాల్సి ఉంది. మార్చి 31వ తేదీ ఈ ఆర్థిక సంవత్సరం గడువు ముగియనుండడంతో లక్ష్యాన్ని చేరుకునేందుకు జీహెచ్ఎంసీ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టారు. జీహెచ్ఎంసీ సర్కిల్–6 పరిధిలోని మూసారాంబాగ్, ఓల్డ్‌మలక్‌పేట, అజంపురా, సైదాబాద్, అక్బర్‌బాగ్, చావుని డివిజన్ల పరిధిలో మొత్తం ఆస్తి పన్నుదారులు 60,630 మంది ఉన్నారు. ఇందులో ఇప్పటివరకు 25,480 మంది పన్ను చెల్లించగా ఇంకా 35000 మంది ట్యాక్స్ చెల్లించాల్సి ఉంది. వారందరికీ ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు, బిల్ కలెక్టర్లు ఇప్పటికే డిమాండ్ నోటీసులు జారీ చేశారు. మార్చి 31లోగా ఈ ఆర్థిక సంవత్సరం ముగుస్తుందని ఈ లోపే జరిమానా లేకుండా పన్నులు చెల్లించాలని సూచిస్తున్నారు. అంతేగాకుండా రెండు, మూడేళ్లుగా పన్నులు చెల్లించకుండా బకాయిలు పడ్డవారికి రెడ్ నోటీసు, వారెంట్లు కూడా జారీ చేస్తున్నారు. ఈ ప్రక్రియ కూడా కొద్దిరోజులుగా ముమ్మరంగా సాగుతున్నది. ఆస్తి పన్ను వసూళ్లకు గడువు ఇంకా రెండు నెలల సమయం మాత్రమే ఉండడంతో బకాయిదారుల నుంచి చెల్లింపులు జరిగేలా చూడాలంటూ దీనికోసం ఇప్పటినుంచే కసరత్తు ప్రారంభించాలని సర్కిల్–6 డీసీ జయంత్ సంబంధిత అధికారులకు సూచించారు.



ఆస్తి పన్ను వసూలు చేస్తున్న అధికారులు

పన్ను వసూళ్ల పురోగతిపై ప్రతిరోజు ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లతో సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నారు. అవసరమైతే బకాయిదారుల ఆస్తులు జప్తు చేయాలన్నా డిమాండ్ కూడా వినిపిస్తోంది.

కామినేని హాస్పిటల్ క్యాంటీన్ ఫుడ్‌లో బొద్దింక

- అవాక్కైన వినియోగదారుడు
- నిలదీయడంతో నిర్వాహకుల ఆగ్రహం



ఫుడ్‌లో వచ్చిన బొద్దింక

మన్సూరాబాద్: కామినేని హాస్పిటల్ క్యాంటీన్ ఫుడ్‌లో బొద్దింక రావడంతో వినియోగదారుడు అవాక్కయ్యాడు. ఈ ఘటన ఎల్‌బీనగర్‌లో శనివారం జరిగింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం. షఫీక్ అనే వ్యక్తి తన భార్యతో కలిసి ఎల్‌బీనగర్‌లోని కామినేని హాస్పిటల్‌కు వచ్చాడు. వైద్యులు లంచ్ తర్వాత రావాలని సూచించగా కుటుంబంతో కలిసి భోజనం చేసేందుకు హాస్పిటల్ క్యాంటీన్‌కు వెళ్లాడు. ఎగ్ ఫ్రైడ్‌రైస్ తింటుండగా ఫుడ్‌లో బొద్దింక రావడంతో అవాక్కై సిబ్బందిని నిలదీశాడు. దీంతో క్యాంటీన్ సిబ్బంది మీ ఇంట్లో బొద్దింకలు ఉండవ అని ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారు. హాస్పిటల్ యాజమాన్యం స్పందించి క్యాంటీన్ నిర్వాహకులపై చర్యలు తీసుకుని రోగులకు నాణ్యమైన ఆహారం అందించాలని ఆయన కోరారు. హాస్పిటల్స్ క్యాంటీన్ కిచెన్స్, ఆహార పదార్థాలపై ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు చేపట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఇదిలాఉంటే ఆహారంలో బొద్దింక రావడంపై హాస్పిటల్ యాజమాన్యం స్పందించింది. క్యాంటీన్ సిబ్బందిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

రైతు బజార్‌ల్లో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్, వనస్థలిపురం రైతు బజార్‌ల్లో కూరగాయల ధరల వివరాలు. టమాటా రూ.11, వంకాయ23, బెండ 40, పచ్చిమిర్చి 35, కాకరకాయ 32, బీరకాయ 35, కాలిఫ్లవర్ 18, క్యాబేజీ 11, క్యారెట్ 15, దొండ 35, ఆలుగడ్డ 23, ఉల్లిగడ్డ 34, గోకరకాయ 28, దోసకాయ 18, సొరకాయ 9, పొట్లకాయ 18, అరటికాయ 9, చిక్కుడుకాయ 35, చామగడ్డ 40, మునగ 85, చిలుకడ దుంప 65, బీట్‌రూట్ 15, కీర 28, బీన్స్ 40, క్యాప్సికమ్ రూ.35. ఈ ధరలు నేటి ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

యూత్ కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడి నియామకం

మలక్‌పేట: యూత్ కాంగ్రెస్ మూసారంబాగ్ డివిజన్ అధ్యక్షుడిగా బాలదానమ్మబస్తీకి చెందిన గురుజువాడ ప్రణయ్ నియమితులయ్యారు. దీంతో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి మహ్మద్ సోహేల్ ఆధ్వర్యంలో శనివారం ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా ప్రణయ్ మాట్లాడుతూ.. యూత్ కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి అమర్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

పుష్కర వార్షికోత్సవం

నాగోలు: బండ్లగూడ శ్రీనివాస కాలనీలోని శ్రీ అభయాంజనేయ స్వామి ద్వాదశ (12) పుష్కర వార్షికోత్సవాన్ని ఆలయ ప్రధాన అర్చకుడు మోటుపల్లి లక్ష్మీ రామాచార్యులు ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయంలో పలు పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఆలయ కమిటీ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఆంగ్ల భాషా పరిజ్ఞానాన్ని పెంపొందించాలి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

మలక్‌పేట: విద్యార్థులకు ఆంగ్ల భాషా పరిజ్ఞానాన్ని పెంపొందించాలని బ్రిలియంట్ గ్రామర్ విద్యాసంస్థల చైర్మన్, కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. విద్యాసంస్థల్లో శనివారం నిర్వహించిన ఇంగ్లీష్ లైబ్రరీ క్లబ్–2025 ముగింపు సందర్భంగా దిల్‌సుఖ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన హాజరై గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ ప్రసాద్, ప్రిన్సిపాల్స్ గౌరీ, వేణి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాక్స్ కల్వర్టు నిర్మాణానికి నిధులు మంజూరు చేయండి

రామంతాపూర్ : భగాయత్ వెంకట్ సాయినగర్ కాలనీ మూసీ నాలాలపై బాక్స్ కల్వర్టు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని విజయేందర్‌రెడ్డి జీహెచ్ఎంసీ జెడ్సీ హేమంత్ కేశవ్‌పటేల్‌కు వినతిపత్రం అందజేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. స్థానికులు ఇంటికి చేరాలంటే 2 కిలోమీటర్ల మేర నడిచి వెళ్లాల్సి వస్తుందని, దీంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. దీనిపై జెడ్సీ సానుకూలంగా స్పందించి నిర్ణయం తీసుకుని, తగిన చర్యలు తీసుకుంటారని అభిప్రాయపడ్డారు. కాలనీవాసులు గోవింద్, శ్రీనివాస్, అశోక్, నవీన్, ఐలేష్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

రామంతాపూర్: వివేక్‌నగర్ శ్రీనివాసపురంలో ఓపెన్ డ్రైన్ నాలా పనులను కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్‌రావు పరిశీలించారు. జీహెచ్ఎంసీ అధికారి నాగమణి, ఏఈ శ్వేతతో కలిసి శనివారం పర్యటించిన ఆమె పనుల జాప్యంపై ఆరా తీశారు.

పద్మశాలీలు నిర్ణయాత్మక శక్తిగా ఎదగాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

ఉప్పల్: పద్మశాలీలు చట్టసభలో నిర్ణయాత్మక శక్తిగా ఎదగాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. భక్త మార్కండేయ జయంతి సందర్భంగా ఉప్పల్ కొమ్మిడి కృష్ణారెడ్డి గార్డెన్‌లో శనివారం నిర్వహించిన పద్మశాలీల ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పద్మశాలీల వైకుంఠ దామానికి స్థలం కేటాయించాలని కుల సంఘాల పెద్దలు ఎమ్మెల్యేను కోరడంతో స్పందించిన ఆయన ఏర్పాటుకు కృషి చేస్తానని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, సినీగేయ రచయిత సుద్దాల అశోక్ తేజ, సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి, రాజకుమార్, బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, సాయిజెన్ శేఖర్, చిలుకానగర్ పద్మశాలీ సంఘం నేతలు నాగరాజు, ప్రసాద్, శివ, బాలచందర్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

మేకలమండిలో సమస్యలు పరిష్కరిస్తాం

బోడుప్పల్: చెంగిచర్లలోని మేకలమండిలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. చెంగిచర్ల స్లాటర్ హౌజ్‌లో శనివారం మండిలో మేకల రైతులు చేపట్టిన నిరసన కార్యక్రమానికి ఆయన సంఘీభావం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. మేకలమండి కాంట్రాక్ట్ తీసుకున్న వ్యక్తి గడువు ముగియడంతో ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందని, ఈ క్రమంలో మండినే నమ్ముకున్న కార్మికులు, మేకల రైతులు, కంటింగ్ వాలాలు ఆందోళన చెందుతున్నారన్నారు. దీనిపై సీఎం, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పోగుల నర్సింహారెడ్డి, మాజీ మేయర్ అజయ్‌యాదవ్, బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్, మాజీ కార్పొరేటర్లు బింగి జంగయ్యయాదవ్, కొత్త చందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



పరీక్షలు చేయించుకుంటున్న మాజీ కార్పొరేటర్ విఠల్‌రెడ్డి

మన్సూరాబాద్: సరిత మెడికల్ క్లినిక్స్, మహాలక్ష్మి మ్యాక్సివిజన్ కంటి హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదిత్యానగర్‌కాలనీలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన వచ్చింది. కార్యక్రమానికి మన్సూరాబాద్ మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. సుమారు 600 మందికి షుగర్, బీపీతో పాటు డెంటల్, కంటి పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ చైర్‌పర్సన్ సంతోషికుమారి, సభ్యులు మోహన్‌రెడ్డి, రవికుమార్, కృష్ణమూర్తి, నాగరాజు, గుప్తా తదితరులు పాల్గొన్నారు.

మూసారంబాగ్ కాలేజీలో..

మలక్‌పేట: మూసారంబాగ్‌లోని అవంతి కాలేజీలో అపోలో, ఫోడ్ డెంటల్ ఆసుపత్రి సౌజన్యంతో జాతీయ సేవా పథకం ద్వారా ప్రత్యేక ఉచిత ఆరోగ్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు విద్యార్థులకు కంటి, దంత, ఈసీజీ పరీక్షలు చేసి పలు సలహాలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్లు అమైరా, లోకేశ్వరీ, స్ఫూర్తి, అవంతి డిగ్రీ, పీజీ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు, కాలేజీ ఏవో మోహన్‌రావు, అధ్యాపకులు రేణుక, నవీన్‌చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు ఐడీబీఐ చేయూత



కంప్యూటర్లు, ప్రింటర్లను అందజేస్తున్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: డివిజన్ పరిధిలోని మన్సూరాబాద్ జడ్పీ, ప్రైమరీ పాఠశాలలకు ఐడీబీఐ బ్యాంక్ రూ.లక్ష 75 వేలతో మూడు కంప్యూటర్లు, ప్రింటర్స్, టేబుల్స్‌ను శనివారం ఉచితంగా అందజేసింది. ఈ కార్యక్రమానికి మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. సీఎస్ఆర్ ఫండ్స్ కింద ప్రభుత్వ పాఠశాలకు ఐడీబీఐ చేయూతనందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఐడీబీఐ డీజీఎం మైఖేల్, హరికృష్ణ, మాధవి, సుధీర్, ఉపాధ్యాయులు రామలింగం, శ్యాంసుందర్ రెడ్డి, కవితారెడ్డి, నాయకులు హరీశ్‌రెడ్డి, ఎంజాల జగన్ తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ జిమ్ ప్రారంభం

హస్తినాపురం: డీఆర్‌డీఎల్ కాలనీలో రూ. 10.50 లక్షలతో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతనాయక్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానన్నారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రాంప్రసాద్, కాలనీ ప్రతినిధులు రాజేంద్రప్రసాద్, కరుణాకర్ రెడ్డి, నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, శేఖర్ రెడ్డి, బ్రహ్మారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మమత మల్లేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



కాలనీవాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్

గార్బేజ్ లిఫ్టింగ్ స్మార్ట్ బిన్స్‌ను వినియోగించుకోవాలి



గార్బేజ్ లిఫ్టింగ్ స్మార్ట్ బిన్స్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్

చాదర్‌ఘాట్: గార్బేజ్ లిఫ్టింగ్ స్మార్ట్ బిన్స్‌ను కాలనీవాసులు వినియోగించుకోవాలని ఓల్డ్‌మలక్‌పేట కార్పొరేటర్ షఫీఉద్దీన్ సూచించారు. డివిజన్‌లో ఏఎంహెచ్ఓ రుద్ర శ్రీనివాస్‌తో కలిసి 31 స్మార్ట్ బిన్స్‌ను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. చెత్త వేసే ప్రాంతాలను గుర్తించి 31 స్మార్ట్ బిన్‌లు ఏర్పాటు చేశామన్నారు. అనంతరం సర్కిల్–6 ఏఎంహెచ్ఓ రుద్ర శ్రీనివాస్ మాట్లాడుతూ.. స్మార్ట్ బిన్స్ ప్రధాన కార్యాలయానికి అనుసంధానమై ఉంటాయన్నారు. చెత్తను లిఫ్ట్ చేయకపోతే వెంటనే సంబంధిత అధికారులకు సిగ్నల్స్ ద్వారా చెత్త లిఫ్టింగ్ చేయలేదని సమాచారం వస్తుందని తెలిపారు. దాంతో వెంటనే సమస్య పరిష్కారం అవుతుందని తెలిపారు. సర్కిల్–6 71 స్మార్ట్ బిన్స్ వచ్చాయని అందులో ఓల్డ్‌మలక్‌పేటలో 31 బిన్స్ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వార్డు కమిటీ సభ్యుడు వాసు, శానిటేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న 'ఫ్యూజన్ ఫిస్టా–2025'

సైదాబాద్: చంపాపేటలోని శ్రీ త్రివేణి పాఠశాల ప్రాంగణంలో 'ఫ్యూజన్ ఫిస్టా–2025' పేరిట శనివారం నిర్వహించిన వార్షిక సాంస్కృతిక వేడుకలు అలరించాయి. ఈ సందర్భంగా సివిల్స్ మెంటర్ మల్లవరపు బాలలత మాట్లాడుతూ.. అనుకున్నది సాధించేవరకు ప్రయత్నాలు కొనసాగించాలన్నారు. అలాగే విద్యార్థుల దేశభక్తి గీతాలు, సాహస ప్రదర్శనలు, సాంప్రదాయ నృత్యాలు ఆకట్టుకున్నాయి. పలు అంశాల్లో నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు శ్రీత్రివేణి ఉన్నత పాఠశాల గోవర్ధన్‌రెడ్డి, బాలలత బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ సురేందర్ రెడ్డి, ప్రిన్సిపాల్ శారద పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ఘనంగా భక్త మార్కండేయ మహర్షి జయంతి



పూజల్లో పద్మశాలీ సంఘం నేతలు

మన్సూరాబాద్: సహారా స్టేట్స్‌కాలనీ పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో భక్త మార్కండేయ మహర్షి జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలోని శివాలయ ప్రాంగణంలోని ఉత్సవ వేదికపై భక్త మార్కండేయ చిత్రపటం ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు పెంటయ్య, ప్రకాశ్, డా.వెంకటేశ్వర్లు, శేఖరయ్య, ప్రభాకర్, శ్రీశైలం, అచ్చయ్య, వేముల ఆనంద్, కృష్ణమోహన్, కిరణ్, విఠలేశ్వర్, వెంకటేశ్వర్లు, కాలనీ మెయింటనెన్స్ కమిటీ అధ్యక్షుడు సయ్యద్‌జానీ తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక



అధ్యక్షుడు చంద్రారెడ్డి

మన్సూరాబాద్: కాలనీ కమ్యూనిటీహాల్‌లో జడ్జెస్‌కాలనీ సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వి.చంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా జనార్ధన్‌రావు, కోశాధికారిగా కలివర్ధన్ రెడ్డి, గౌరవ అధ్యక్షుడిగా చంద్రకాంత్‌రెడ్డి, ముఖ్య సలహాదారుడిగా టంగుటూరి నాగరాజు, ఉపాధ్యక్షులుగా రమేశ్‌రావు, యాదగిరేందర్, సంయుక్త కార్యదర్శులుగా రవికుమార్‌రెడ్డి, బాలాజీ యాదవ్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా ప్రవీణ్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, మహేశ్, కార్యవర్గ సభ్యులుగా యాదగిరిగౌడ్, జంగారెడ్డి, గ్యామానాయక్, అనిల్‌రెడ్డి, మధుసూధన్‌రావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు నూతన అధ్యక్షుడు చంద్రారెడ్డి తెలిపారు.

రోడ్డు భద్రత, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రమేశ్

నాగోలు: రోడ్డు భద్రత, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని నాగోలు ఎస్ఐ రమేశ్ సూచించారు. జైపురికాలనీ రోడ్ అజయ్‌నగర్ కాలనీని శ్రీ కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో శనివారం ఏర్పాటు చేసిన రోడ్డు భద్రత, సైబర్ నేరాలు, షీ టీం సేవలపై జరిగిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వాట్సాప్, ఫేస్‌బుక్‌కు వచ్చిన లింకులు ఓపెన్ చేయవద్దని, అలాగే గుర్తింపు లేని యాపులను డౌన్లోడ్ చేయవద్దని సూచించారు. అలాగే వాహనదారులు తప్పకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. ఎవరైనా మహిళలతో అసభ్యంగా ప్రవర్తిస్తే వెంటనే షీ టీమ్ వారికి సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో నాగోలు పోలీస్ సిబ్బంది, శ్రీ కృష్ణవేణి టాలెంట్ స్కూల్ ప్రిన్సిపాల్ ప్రేమానందాచారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గడ్డిఅన్నారంలో..

మలక్‌పేట: పిరమల్ ఫైనాన్స్, సిటీ, మలక్‌పేట పోలీసుల సంయుక్తాధ్వర్యంలో గడ్డిఅన్నారంలోని ఓ ప్రైవేట్ ఇనిస్టిట్యూట్‌లో యువతకు సైబర్ మోసాలపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాతళ భైరవీ కాన్సెప్ట్ బృందం వారు ప్రదర్శనలతో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మలక్‌పేట ఇన్‌స్పెక్టర్ పిడమర్తి నరేశ్, ఎస్సై నవీన్, మైత్రీ కమిటీ చైర్మన్ లింగాల శ్రీనివాస్‌గౌడ్, బృందం సభ్యులు సంజయ్ పాండే, మీనా భవాని, దనిష్ అలీ, సాయి కదిరన్, మహేశ్, హేమంత్, స్వప్న, విశాల్ తదితరులు పాల్గొన్నారు.

యువతకు అవగాహన కల్పిస్తున్న బృందం

